ప్రజాశక్తి
మంగళవారం 23 సెప్టెంబరు, 2025
5
శ్రీకాకుళం

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాల నియామకాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

నగరంలోని ప్రభుత్వ వైద్య కళాశాల (రిమ్స్), ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో 41 అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాల నియామకానికి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుడ్కర్ ప్రకటన విడుదల చేశారు. మంగళవారం నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. అక్టోబర్ 1వ తేదీ చివరి తేదీ అని తెలిపారు. www.srikakulam.ap.gov.inలో పూర్తి వివరాలు పొందుపర్చినట్లు తెలిపారు.

పని గంటల పెంపును వ్యతిరేకించాలి

శ్రీకాకుళం సిటీ : నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు, కార్మికులు

కంచిలి : ధర్నా చేస్తున్న కార్మికులు

- కార్మిక చట్ట సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలి
- పది గంటల పని విధానాన్ని రద్దు చేయాలి
- సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి - ఎచ్చెర్ల, శ్రీకాకుళం సిటీ

రాష్ట్ర ప్రభుత్వం పని గంటల పెంపును వ్యతిరేకిస్తూ కార్మికవర్గం ఉద్యమించాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. కార్మిక చట్ట సవరణ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని, పది గంటల పని విధానాన్ని రద్దు చేసి ఎనిమిది గంటల పని విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ జిల్లాలోని పలుచోట్ల సిఐటియు ఆధ్వర్యాన కార్మికులు సోమవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా ఎచ్చెర్లలో నాగార్జున అగ్రికమ్ పరిశ్రమ వద్ద, శ్రీకాకుళం నగరంలోని నగరపాలక సంస్థ కార్యాలయం గాంధీ విగ్రహం వద్ద సిఐటియు ఆధ్వర్యాన కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం.ఆదినారాయణమూర్తి, కె.సూరయ్య మాట్లాడుతూ రాష్ట్ర బ్రిటిష్ కాలంలో పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని దినాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఫ్యాక్టరీలు, షాపులు, సంస్థల్లో కార్మిక చట్టాలను మార్చి 8 గంటల పని దినాన్ని పది గంటలకు పెంపుదల చేస్తూ అసెంబ్లీలో తెలుగుదేశం, జనసేన, బిజెపి ఎమ్మెల్యేలు ఆమోదించారని తెలిపారు. కార్మిక వ్యతిరేక చర్యను సిఐటియు ఖండిస్తోందన్నారు. వైసిపి అసెంబ్లీకి వెళ్లకుండా బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ బిల్లును కౌన్సిల్‌లో ఆమోదానికి పెట్టే అవకాశం ఉందని, అక్కడ పిడిఎఫ్, వైసిపి సభ్యులు దీన్ని వ్యతిరేకించాలని, బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి ఎం.గోవర్ధనావు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం, స్మార్ట్‌కమ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు బి.జనార్ధనరావు, నీలం జూట్ కార్మిక సంఘం అధ్యక్షులు ఎన్.నాగేశ్వరరావు, నాగార్జున అగ్రికమ్ యూనియన్ నాయకులు అంబటి సత్యనారాయణ, టి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కంచిలి : కంచిలిలో సిఐటియు కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, జిల్లా కార్యదర్శి ఎస్.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 2023లో కర్నాటక, ఈ ఏడాదిలో గుజరాత్‌లోని బిజెపి ప్రభుత్వాలు కార్మికుల పని గంటలు పెంచడాన్ని రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రభుత్వం ఆదర్శంగా తీసుకుందని విమర్శించారు. విరామంతో కలిపి ఫ్యాక్టరీల్లో రోజుకు ఉన్న 9 గంటల పనిని 10 గంటలకు పెంచిందన్నారు. 5 గంటల పని తర్వాత విశ్రాంతి ఉన్న నిబంధనను 6 గంటల పని తర్వాతకు మార్చిందని తెలిపారు. ప్రత్యేక సందర్భాల్లో కార్మికులు రోజుకు చేయవల్సిన పని గంటలను విశ్రాంతి, విరామాలతో కూడా కలిపి 10.30 గంటలు ఉన్న దాన్ని 12 గంటలకు పెంచిందన్నారు. షాపులు, సంస్థల్లో పని గంటలను 8 నుండి 10కు పెంచింది. ఫ్యాక్టరీలు, షాపులు, సంస్థల్లో రక్షణకు సంబంధించిన కొన్ని నిబంధనలు అమలు చేస్తూ మహిళలను రాత్రిపూట కూడా పని చేయడాన్ని అనుమతించిందని తెలిపారు. కార్మిక వ్యతిరేక బిజెపి, కూటమి ప్రభుత్వ విధానాలపై పోరాటం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ పిట్ట కృష్ణ, రైతుసంఘం నాయకులు కె.గోపీనాథ్, జయరాం తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు : మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలిలో సిఐటియు ఆధ్వర్యాన నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి.రమేష్, ప్రజాసంఘాల నాయకులు సిర్ల ప్రసాదరావు, హరికృష్ణ, ఆనందరావు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు : ధర్నా చేస్తున్న కార్మికులు

ఎచ్చెర్ల : ధర్నా చేస్తున్న కార్మికులు

సంఘీభావం తెలుపుతున్న నాయకులు

'థర్మల్' పేరుతో బలవంతపు భూసేకరణ

- ఆపకపోతే ప్రజాప్రతిఘటన తప్పదు
- థర్మల్ వ్యతిరేక సదస్సులో వక్తలు

ప్రజాశక్తి - బూర్జ

థర్మల్ పవర్ ప్లాంట్ పేరుతో బలవంతపు భూసేకరణ ఆపకపోతే ప్రజాప్రతిఘటన తప్పదని థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మండలంలోని అడ్డూరుపేటలో సోమవారం నిర్వహించిన థర్మల్ పవర్ ప్లాంట్ వ్యతిరేక సదస్సులో వక్తలు మాట్లాడుతూ జిల్లాలో అణుపార్కు, కార్గో ఎయిర్‌పోర్టు, థర్మల్ ప్లాంట్ పేరుతో భూ దోపిడీ చేస్తూ జిల్లా విధ్వంసానికి పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. ప్రజల ఆస్తులను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడమే అభివృద్ధా అని ప్రశ్నించారు. జిల్లా అభివృద్ధి చెందాలంటే పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి, చివరి భూముల వరకు నీరు ఇస్తే జిల్లా సస్యశ్యామలం అవుతుందని తెలిపారు. పెండింగ్ ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయడం లేదని, నేరడి బ్యారేజీని ఎందుకు నిర్మించడం లేదని ప్రశ్నించారు. రైతుల అనుమతి లేకుండా డ్రోన్ ద్వారా దొడ్డిదారిన సర్వేలు చేయడం చట్ట వ్యతిరేకమైన చర్య అని అన్నారు. బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా థర్మల్ ప్లాంట్, కొవ్వాడ అణువిద్యుత్కేంద్రం, కార్గో ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా విశాల ఐక్య ఉద్యమాలను ఉధృతం చేస్తామన్నారు. సభలో సిపిఎం, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శులు డి.గోవిందరావు, తాండ్ర ప్రకాష్, వంకల మాధవరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.శ్రీనివాస్, లిబరేషన్ నాయకులు తామాడ సన్యాసిరావు, మద్దిల రామారావు, మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు ఎస్.కృష్ణ, థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షులు సవర లక్ష్మణరావు, బాడంగి సురేష్, ఆదివాసీ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న, కార్గో ఎయిర్‌పోర్టు పోరాట కమిటీ నాయకులు జె.అప్పారావు, పలు ప్రజాసంఘాల నాయకులు పోలాకి ప్రసాదరావు, జి.సింహాచలం, గోపాల్, పెద్దసంఖ్యలో థర్మల్ ప్రభావిత గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సభలో పాల్గొన్న ప్రజలు

ప్రశాంత దర్శనానికి పక్కా ఏర్పాట్లు

మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

కొత్తమ్మతల్లి శతాబ్ది ఉత్సవాల్లో యాత్రిలకు అసౌకర్యం కలగకుండా ప్రశాంతంగా దర్శనం చేసుకొనే విధంగా అవసరమైన ఏర్పాట్లు పక్కాగా కల్పించినట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. కోటబొమ్మాళిలోని వంశధార హైస్కూల్ మైదానంలో యాత్రికులకు, పర్యాటకులకు కొత్త అనుభూతిని కల్పించే విధంగా ఉత్సవాల్లో తొలిసారి ఆకర్షణగా నిలిచే హెలికాప్టర్ రైడ్ హెలిపాడ్‌ను పరిశీలించారు. పరిసర ప్రాంతాలను తిరిగి అధికారులకు సూచనలను జారీ చేశారు. వంశధార హైస్కూల్లో ఏర్పాటు చేసిన హెలికాప్టర్ రైడ్ టిక్కెట్ల కౌంటర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు సుధాకర్, ఆర్అండ్‌బిఎస్ ఇ. సత్యనారాయణ, నెహ్రూ యువ కేంద్ర సహాయ సంచాలకులు వెంకట్ ఉజ్వల్, జిల్లా పంచాయతీ అధికారి భారతీ సౌజన్య, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.చెన్నకేశవరావు, ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి, తహశీల్దార్ ఆర్.అప్పలరాజు, ఎంపిడిఒ ఫణీంద్రకుమార్, డిఎస్‌పి లక్ష్మణరావు, రూరల్ సిఐ శ్రీనివాసరావు, కొత్తమ్మ తల్లి ఆలయ ఇఒ రాధాకృష్ణ పాల్గొన్నారు.

పటిష్ట పోలీసు బందోబస్తు : ఎస్‌పి

ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్న కొత్తమ్మతల్లి ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి తెలిపారు. ముగ్గురు డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, క్రైమ్ టీమ్ పోలీసులు, స్పెషల్ పార్టీ పోలీసుల బృందాలు సుమారు 800 మంది పోలీసు సిబ్బందితో ముందెన్నడూ లేనంతగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. బందోబస్తు విధులు నిర్వహించే పోలీసు అధికారులు, సిబ్బందికి సోమవారం దిశానిర్దేశం చేశారు. దర్శనానికి వచ్చే యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. వృద్ధులు, వికలాంగులు నడవలేని వారికి ప్రత్యేకంగా దర్శనానికి అవకాశం కల్పించాలన్నారు. అవసరమైతే ప్రత్యేక వాహనాల ద్వారా దర్శనానికి తీసుకెళ్లాలని సూచించారు. రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ మార్గాలు సిద్ధం చేసి, ఎటువంటి తోపులాటకు ఆస్కారం లేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. యాత్రికులతో పోలీసులు మర్యాదపూర్వకంగా మెలగాలని సూచించారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా పార్కింగ్ యాత్రికులు తమ వాహనాలను నిర్దేశించిన పార్కింగ్ ప్రదేశాల్లో నిలిపేలా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. శోభాయాత్ర, గ్రామీణ క్రీడలు, ఎగ్జిబిషన్, హెలికాప్టర్ టూరిజం, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. కమాండ్ కంట్రోల్ నుంచి సిసి, డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. ఇతర శాఖల సమన్వయంతో ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

యూరియా లారీ అడ్డగింత

- 333 బస్తాలకు 112 బస్తాలు రావడంపై రైతుల నిరసన
- మిగతా బస్తాలు కీలక ప్రజాప్రతినిధి తరలించుకుపోయారు
- మలకాం టిడిపి సర్పంచ్ శ్రీనివాసరావు ఆరోపణ

ప్రజాశక్తి - పొందూరు

యూరియా కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్న రైతులకు యూరియా లారీ వచ్చిందన్న ఆనందం కాసేపటికే ఆవిరైంది. అరకొర యూరియా రావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియా లారీని అడ్డుకుని, లోడును దించనీయకుండా నిరసన తెలిపారు. మండలంలోని మలకాం పంచాయతీకి తొలి విడతలో 444 యూరియా బస్తాలు వచ్చాయి. మరో 450 బస్తాలు కావాల్సి ఉండగా, 333 బస్తాలను కేటాయించినట్లు అధికారులు తెలిపారు. సోమవారం లారీలో 112 బస్తాలు మాత్రమే వచ్చాయి. తమకు కేటాయించిన యూరియాను సరఫరా చేయకపోవడంపై మలకాం గ్రామానికి సోమవారం వచ్చిన యూరియా లారీని రైతులతో కలిసి టిడిపి సర్పంచ్ జాడ శ్రీనివాసరావు అడ్డుకుని నిరసన తెలిపారు. తమకు కేటాయించిన బస్తాల్లో మిగిలిన 221 బస్తాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. జిల్లాకు చెందిన కీలక ప్రజాప్రతినిధి ఆయన నియోజకవర్గానికి తరలించుకుపోయారని ఆరోపించారు. తమ పంచాయతీకి అందాల్సిన యూరియాను పూర్తిస్థాయిలో సరఫరా చేయాలని, లేకుంటే లారీలో యూరియా లోడును దించనివ్వబోమన్నారు. రూ.వేలల్లో అప్పులు చేసిన పెట్టుబడులు పెడుతున్న రైతులకు సకాలంలో యూరియా అందించలేదని, చివరకు కేటాయించిన వాటినీ పక్కదారి పట్టించారని విమర్శించారు. విషయం తెలుసుకున్న మండల వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసరావు అక్కడకు చేరుకున్నారు. ప్రస్తుతం చేసిన కేటాయింపుల మేరకు యూరియా వచ్చిందని, మరో విడతలో మిగతా వస్తుందని రైతులకు నచ్చజెప్పారు.

యూరియా లారీని అడ్డుకున్న సర్పంచ్ శ్రీనివాసరావు, రైతులు

విద్యుత్ ఉద్యోగుల ఆందోళన

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఎపి స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జెఎసి నేతృత్వాన సంబంధిత కాంట్రాక్టు ఉద్యోగులు, కార్మికులు సోమవారం నిరసనల్లో భాగంగా శాంతియుత ర్యాలీ నిర్వహించారు. విద్యుత్‌శాఖ కార్యాయం నుంచి జిల్లా పరిషత్ వరకు ర్యాలీగా వెళ్లారు. ఈ ర్యాలీలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ మేరకు జిల్లా పరిషత సమావేశ మందిరం ముందు ఆందోళన చేశారు. అనంతరం మీకోసం ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుడ్కర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ర్యాలీకి పోలీస్ భద్రత కొనసాగింది. సంఘ నాయకులు మాట్లాడుతూ పెరిగిన పని ఒత్తిడిని తగ్గించాలన్నారు. కొత్త ఉద్యోగ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇంతవరకూ ఒక్కో ఉద్యోగికి రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర వరకూ ఎరియర్స్ రావాల్సి ఉందన్నారు. ప్రతి పిఆర్‌సిలోనూ తమకు అన్యాయం జరుగుతూనే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. జూనియర్ లైన్‌మెన్లను గ్రేడ్ -2లను విద్యుత్ సంస్థలో విలీనం చేయాలన్నారు. విద్యుత్ సంస్థలో పెన్షన్ ట్రస్టును బలోపేతం చేయాలన్నారు. విశ్రాంత తరువాత కనీసం రూ.ఐదు లక్షలైనా పెన్షన్ బెనిఫిట్స్ వచ్చేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఇపిఎఫ్, జిపిఎఫ్ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎం.వి.గోపాలరావు, జి.రామార్జున్‌కుమార్, పి.వి.అప్పలనాయుడు, బి.వి.గురునాథరావు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

విద్యారంగంపై శ్వేతపత్రం విడుదల చేయాలి

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు

మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

2021 నుంచి ప్రపంచ బ్యాంకు అప్పుతో నడుస్తున్న సాల్ట్ పథకం ద్వారా ఆంధ్రాలో చేస్తున్న విద్యా రంగ సంస్కరణల వల్ల వచ్చిన లాభనష్టాలపై శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. నగరంలోని యుటిఎఫ్ కార్యాలయంలో సోమవారం జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాణ్యమైన విద్య, ఇంగ్లీషు బోధన లక్ష్యంగా ప్రపంచ బ్యాంకు నుంచి రూ.1860 కోట్లు గత ప్రభుత్వం అప్పు తీసుకొచ్చిందని అన్నారు. దీని కనుగుణంగా విద్యారంగ సంస్కరణలు చేపట్టిందని తెలిపారు. ఈ విద్యారంగ సంస్కరణలో ఆశించిన లక్ష్యం నెరవేరిందా? లేదా? అనే అంశంపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. తెలుగు నేల, పోరాడి సాధించుకున్న మొట్టమొదటి భాషా సంయుక్త రాష్ట్రంలో తెలుగు మీడియం లేకుండా చేయడం సరికాదన్నారు. ఏకోపాధ్యాయ పాఠశాలల సంఖ్య ఏటా పెరుగుతుందన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఆర్.మోహనరావు, రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్ మాట్లాడుతూ పాఠశాలల్లో స్వేచ్ఛ బోధన చేయడానికి కావాల్సిన అనుకూల వాతావరణాన్ని ఏర్పర్చాలన్నారు. రోజుకో గందరగోళం లెక్కలతో ఉపాధ్యాయులని భయాందోళనకు, బెదిరింపులకు గురి చేయటం వల్ల విద్యార్థులకు నాణ్యమైన విద్య రాదనే విషయాన్ని తెలుసుకోవాలన్నారు. 2023 జూలై నుంచి రావాల్సిన 12వ పిఆర్‌సి చైర్మన్‌ని ఇప్పటికీ నియమించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నాలుగు డిఎలను, 11వ పిఆర్‌సి బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.బాబూరావు, బి.శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ ఈ నెల 25న గుంటూరులో నిర్వహించనున్న రణభేరీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

త్వరలో ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపు

సాంఘిక సంక్షేమశాఖ ఉప సంచాలకులు మధుసూదనరావు

మాట్లాడుతున్న మధుసూదనరావు

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

విద్యార్థులకు విడతల వారీగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపునకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు మధుసూదనరావు తెలిపారు. దీనిపై కళాశాలల యాజమాన్యాలు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు వర్శిటీలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జ్ఞానభూమి పోర్టల్‌లో పలు సాంకేతిక మార్పులు, విద్యార్థుల బయోమెట్రిక్ పెండింగ్ వంటి సమస్యల వల్ల బకాయిల మంజూరులో జాప్యమవుతోందని చెప్పారు. వర్శిటీ వైస్ ఛాన్సలర్ కె.ఆర్ రజని మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో డిగ్రీ ప్రవేశాలు, కోర్సుల నిర్వహణలో కొత్త మార్గదర్శకాలు వచ్చాయన్నారు. ఇంటర్న్‌షిప్ కాలవ్యవధి తగ్గింపు, క్వాంటమ్ టెక్నాలజీ, మెషిన్ లెర్నింగ్ వంటి నూతన బోధనాంశాలు అమలు కానున్నాయని తెలిపారు. సిడిసి డీన్, వర్శిటీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ఉదయ్‌భాస్కర్ మాట్లాడుతూ అపార్ ఐడి నమోదు కార్యక్రమం పూర్తిస్థాయిలో జరిగేలా కళాశాలలు చొరవ తీసుకోవాలని సూచించారు. ఆయా కళాశాలల యాజమాన్య ప్రతినిధులు మాట్లాడుతూ ప్రతి ఏడాది బయోమెట్రిక్ పరికరాల్లో మార్పులు తెస్తుండడంతో పలు చిక్కులకు అస్కారం ఏర్పడుతుందన్నారు. 2023 విద్యాసంవత్సరం నుంచి ఏడు విడతలుగా ప్రభుత్వం నుంచి రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే చెల్లించి ఉన్నత విద్య గాడిలో పడేలా చూడాలని కోరారు. సమావేశంలో వర్శిటీ రిజిస్ట్రార్ బి.అడ్డయ్య, అకడమిక్ అఫైర్స్ డీన్ కె.స్వప్నవాహిణి, ఎస్ఒ కె.సామ్రాజ్యలక్ష్మి, యుజి పరీక్షల డీన్, అసిస్టెంట్ డీన్‌లు జి.పద్మారావు మాట్లాడారు.

వేతనం చెల్లింపులో నిబంధనలు తప్పనిసరి

శ్రీకాకుళం సిటీ: వేతన చెల్లింపు చట్టానికి లోబడి నిబంధనలు మేరకు కనీస వేతనాలు చెల్లించాలని ఉప కార్మిక కమిషనర్ కె.దినేష్ కుమార్ తెలిపారు. శ్రీకాకుళం కార్యాలయం పరిధిలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ప్రకారం వేతనాలు అమలు తెలుసుకునేందుకు సోమవారం నాలుగు దుకాణాలు, సంస్థల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో ఏడుగురు కార్మికులకు కనీస వేతన చట్టం ప్రకారం తక్కువ వేతనాలు చెల్లించినట్లు తేలిందన్నారు. దాంతో సంబంధిత యజమానుల నుంచి వ్యత్యాసం మొత్తంగా రూ.48,162 డిడి రూపంలో కార్మికులకు చెల్లింపులు చేయించారు. కార్మికులకు తగిన వేతనాలు చెల్లించడం యజమానుల బాధ్యత అని, ఎటువంటి నిర్లక్ష్యం సహించబడదని స్పష్టం చేశారు. వేతన చెల్లింపులు సక్రమంగా లేకుంటే ఉద్యోగులు, కార్మికులు ఫిర్యాదు చేయాలని సూచించారు.

కెజిబివి ఘటనపై విచారణ చేయాలి

కలెక్టర్‌కు ఎస్ఎఫ్ఐ ఫిర్యాదు
'మీకోసం'కు 85 వినతులు

జెసికి వివరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

పొందూరు కెజిబివిలో ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థి చిత్తరంజన్ వందన మూడంతస్తుల మేడపై నుంచి కింద పడిన ఘటనపై సమగ్ర విచారణ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పి.పవిత్ర, జిల్లా కమిటీ సభ్యులు నగేష్, శివ జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌ను కోరారు. నగరంలోని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం)కు జిల్లావ్యాప్తంగా పలు సమస్యలపై 85 వినతులు వచ్చాయి. పొందూరు కెజిబివి ఎస్ఒ లలిత కుమారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థికి మెరుగైన వైద్యం అందించి, కుటుంబానికి ఆర్థికసాయం అందించాలని కోరారు. పొందూరు మండలంలో ఎరువుల కొరత వెంటాడుతుందని, సమస్య పరిష్కరించాలని రైతులతో కలిసి ఆమదాలవలస నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త చింతాడ రవికుమార్ వినతిపత్రం అందజేశారు. పొందూరులో ఒక గ్రూపునకు కొమ్ముకాస్తున్న వ్యవసాయ అధికారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. స్త్రీశక్తి పథకం వల్ల ప్రైవేట్ బస్సుల్లో 80 శాతం మహిళల ఆక్యుపెన్సీ రేటు పడిపోయిందని ప్రైవేట్ బస్ ఆపరేటర్స్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షులు కట్టా సూర్యప్రకాశరావు, ప్రైవేట్ బస్సుల యజమానులు ఫిర్యాదు చేశారు. ప్రైవేటు బస్సుల్లోనూ స్త్రీశక్తి పథకం అమలు చేసి, టిక్కెట్లకు రీయింబర్స్‌మెంట్ అమలు చేయకపోతే భవిష్యత్‌లో బస్సులు నడపలేమన్నారు. వంశధార నిర్వాసిత ప్రాంతంలో భూసేకరణ చేసిన భూముల నష్టపరిహారం పెంచాలని జిల్లా ఫెడరేషన్ ఆఫ్ కస్టమర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యాన బుడుమూరు శ్రీరామ్మూర్తి ఫిర్యాదు చేశారు. శ్రీకాకుళం నగరంలోని ప్రశాంతి వృద్ధాశ్రమంలో సమీపంలో శ్రీ సాయి శ్రీనివాస్ నగర్ లేఅవుట్‌లో రోడ్డుకు నగరపాలక సంస్థ నోటిఫికేషన్ జారీ చేసిందని, దీనివల్ల 40 మంది ఇళ్లు, ప్లాట్లు కోల్పోతారని, 150 అడుగుల రోడ్డు ప్రతిపాదన విరమించుకోవాలని స్థానికులు కోరారు. పలాస మండలం రేగులపాడు వద్ద ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులు నత్తనడకన సాగుతున్నాయని, త్వరితగతిన పూర్తి చేయాలని మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ టిడిపి నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. పలాస నియోజకవర్గంలో హుదూద్ ఇళ్లు వీలైనంత త్వరగా లబ్ధిదారులకు అందేలా అందేలా చూడాలని కోరారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో పాటు ప్రత్యేక ఉప కలెక్టర్ పద్మావతి, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజా, డిఆర్‌డిఎ పిడీ కిరణ్ కుమార్ వినతులను స్వీకరించారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL CIVIL JUDGE (SENIOR DIVISION) AT SRIKAKULAM
SOP 02/2025

Between :-
01 Budidha Rekha, W/o Late Poorna kumar, aged 25 years, House wife, resident of Door No4- 13, Chinna Veedi,Laveru Village, Laveru Mandal, Srikakulam Disrtict, Aadhar No. 526141628722& Mobile No. 7995929079.
2) Anemu Nagamani, W/o Appa rao aged 31 years,House wife,resident of Door No4-65A , Teemara, Village, Pathapatnam Mandal, Srikakulam Disrtict, Aadhar No. 247484997469 Mobile No. 8247309354.
......Petitioners
And:- **NIL** .....Respondent

PUBLICE NOTICE

పై నెంబర్ సక్సెషన్ OPలో బూడిద కుమారి మరణాంతరము పైన తెలిపిన పిటిషనర్లు మాత్రమే వారసులుగా ఉన్నారు అందుకొరకు సక్సెషన్ సర్టిఫికెట్ శ్రీకాకుళం గౌరవ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జ్ కోర్టులో దాఖలు చేసుకున్నారు. కావున బూడిద కుమారికు ఇంకా ఎవరైనాను వారసులు ఉన్నను **తేదీ 24- 09-2025** ఉదయం **10:30 లకు** పైన తెలిపిన కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని లేదా వకీల్ ద్వారా గా హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియజేయవలెను లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించడం అగును

నక్క ప్రసాద్ రావు
న్యాయవాది,
శ్రీకాకుళం, సెల్:9701844297.

సమస్యలు వింటున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ప్రజా ఫిర్యాదులకు ప్రాధాన్యం

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ప్రజా ఫిర్యాదులు స్వీకరణ, పరిష్కారం (పబ్లిక్ గ్రీవెన్స్) కార్యక్రమంలో స్వీకరించే ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి పూర్తిస్థాయిలో విచారణ జరిపి పరిష్కారం చూపాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార వేదిక నిర్వహించారు. ముందుగా వృద్ధులు, వికలాంగుల వద్దకు వెళ్లి వారి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన 63 మంది ఫిర్యాదుదారులతో ముఖముఖీగా మాట్లాడి వారి ఫిర్యాదులను వివరంగా అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదు లన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, సత్వరం పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఆయా ఫిర్యాదులపై సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి త్వరితగతిన భాదితలకు న్యాయం అందించేలా చూడాలన్నారు. ఫిర్యాదులన్నింటిపై తీసుకున్న పరిష్కార చర్యలు, పూర్తి వివరాలను నివేదిక రూపంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి అందజేయాలని అధికారులను సూచించారు.

పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న సచివాలయ అధికారులు

లైదాంలో పారిశుధ్య పనులు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- పొందూరు

మండలం లైదాం గ్రామంలో సర్పంచ్ గొర్లె అనంత రామకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం పారిశుధ్య పనులను చేపట్టారు. గ్రామంలో కొంతకాలంగా పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో ఈనెల 20న 'పారిశుధ్య నిర్వాహణ ఇలాగేనా..?' అంటూ ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి పారిశుధ్య పనులను చేపట్టారు. గ్రామంలోని కాలువలు, చెత్తాచెదారాలు, పిచ్చిమొక్కలతో అధ్వానంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డామని ఆవేదనను వ్యక్తం చేశారు. ఎట్టకేలకు గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టి చెత్తా చెదారాలు, పిచ్చిమొక్కలు తొలగించడంపై ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ పనులను కార్యదర్శి పి.జయరాం, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఎస్.జయరాంలు పరిశీలించారు.

మాట్లాడుతున్న మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గీత

అభివృద్ధి నిరోధకులు వైసిపి నాయకులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

నియోజకవర్గ అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా వైసిపి నాయకులు పెట్టుకున్నారని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత అన్నారు. సోమవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ థర్మల్ పవర్‌ప్లాంట్‌పై లేనిపోని ఆరోపణలు చేస్తూ తప్పుడు ప్రచారాలతో ప్రజలను తప్పుదారి పట్టించేందుకు వైసిపి నాయకుడు చింతాడ రవికుమార్ ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. థర్మల్ పవర్‌ప్లాంట్ ద్వారా యువతకు ఉపాధి లభిస్తుందని, నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందన్నారు. దీంతో ఎమ్మెల్యే రవికుమార్ తిరుగులేని నాయకుడిగా ఎదుగుతారనే భయంతో వైసిపి నాయకులు గిరిజనులను, ప్రజలను మభ్యపెట్టి తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు నూకరాజు, రాష్ట్ర బిసిసెల్ ప్రధాన కార్యదర్శి బోర గోవిందరావు, పిఎసిఎస్ అధ్యక్షులు శిమ్మ మాధవి, రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ బోనెల అప్పారావు, సరుబుజ్జిలి మండల టిడిపి అధ్యక్షుడు అంబల్ల రాంబాబు, టిడిపి పట్టణ అధ్యక్షుడు సంపద రావు మురళి, పట్టణ టిడిపి మహిళా అధ్యక్షులు బోయిన సునీత తదితరులు పాల్గొన్నారు.

దుస్తులను అందజేస్తున్న జ్యోతి ఫెడరిక్

ఉత్తమ ఫలితాలు సాధించాలి

ప్రజాశక్తి- నరసన్నపేట

విద్యార్థులు ఫలితాలు సాధించాలని డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ ఎం.జ్యోతి ఫెడరిక్ అన్నారు. నరసన్నపేటలో ఎస్‌విసిటి, పదాల ఛారిటబుల్ ట్రస్టు సంయుక్తంగా పేద విద్యార్థులకు సోమవారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాశాల లెక్చరర్‌గా, ప్రిన్సిపాల్‌గా తనకు విద్యార్థులతో అనుబంధం ఎక్కువని అన్నారు. గౌరవ అతిథి స్వామిబాబు మనుమడు టంకాల అర్జున్ మాట్లాడుతూ ట్రస్టు ద్వారా ప్రయోజనం పొందే అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు చెల్లిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో అమ్మ ఆసరా సేవా సంస్థ అధ్యక్షులు సదాశివుని కృష్ణ, కో-ఆర్డినేటర్ దేవిరెడ్డి రమేష్, ఉపాధ్యాయులు సాయిశ్రీనివాస్‌శర్మ, కరుణ్, శ్రీదేవి, వి.దివ్య, సూరపు రామారావు, లక్ష్మీనారాయణ, కాంతారావు పాల్గొన్నారు.

కొత్తమ్మతల్లి కార్యవర్గం ప్రమాణ స్వీకారం

ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

కోట బొమ్మాళి: కొత్తమ్మతల్లి ఆలయాభివృద్ధికి కృషి చేస్తానని కమిటీ అధ్యక్షులు కోరాడ చిన్న గోవింద్ అన్నారు. కొత్తమ్మతల్లి ఆవరణలో సభ్యులతో పాటు చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేశారు. సభ్యులు అభిప్రాయాలు తెలుసుకొని గోవింద్‌కు ఏకగ్రీవంగా అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. అమ్మవారి ఉత్సవాలు మూడురోజులు పాటు భక్తులకు ఎలాంటి అ సౌకర్యాలు కలగకుండా కృషి చేస్తానని తెలిపారు. అనంతరం గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, ఎఎంసి చైర్మన్ బగాది శేషు, టిడిపి మండల అధ్యక్షులు బోయిన రమేష్, వెలమల కామేశ్వరరావు, విజయలక్ష్మి, తర్ర రామకృష్ణ, పూజారి శైలజ తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఆరోగ్య సంరక్షణకు పెద్దపీట

నరసన్నపేట: రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ శిరీష

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని డొంకలపర్త గ్రామంలో సోమవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని అవసరమైన మహిళలకు ఎన్‌సిడి స్క్రీనింగ్, కేన్సర్ స్క్రీనింగ్, గర్భిణీ సంరక్షణ, మాతా శిశురక్షణ కార్డులు, టీకాలు, రక్తహీనత స్క్రీనింగ్, పరీక్షలు నిర్వహించారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ మహిళలకు అద్భుత వరమని బూర్జ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాజశేఖర్ అన్నారు. కార్యక్రమంలో ఆయుర్వేద డాక్టర్ మంగమ్మ, సిహెచ్ అప్పలస్వామి, సూపర్‌వైజర్ సరోజమ్మ, ఎంఎల్‌హెచ్‌పి అలేఖ్య, రాధిక, ఎఎన్‌ఎం కుమారి, జగదాంబ, హెల్త్ అసిస్టెంట్లు రాంబాబు, శ్రీను, సర్పంచ్ ప్రభావతి, కూటమి నాయకులు జడ్డు కృష్ణ, బెజ్జిపురం స్వామి నాయుడు, తోటన్న నాయుడు, జట్టు చిన్నం నాయుడు, బెనర్జీ, బాల, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అలాగే మండలంలోని పెద్దపేట ఆర్ట్స్ సంస్థ ఆధ్వర్యంలో స్వస్త్ నారి సశక్త్ పరివార్ కార్యక్రమానికి జిల్లా నాబార్డ్ డిడిఎం నాగర్జున హాజరయ్యారు. మహిళల ఆరోగ్యంలో భాగంగా రక్తహీనత, తల్లి శిశుసంరక్షణ, మంచి పోషకాహారం, పరిశుభ్రత జీవన శైలిపై ప్రత్యేక అవగాహన, మానసిక ఆరోగ్యానికి కౌన్సిలింగ్ ఆత్మవిశ్వాసం పెంపొందించుకునేలా అవసరం ప్రతి ఒక్క ఉందని ఆయన వివరించారు. కార్యక్రమంలో ఆర్ట్స్ సంస్థ డైరెక్టర్ సన్యాసిరావు, సిఇఇ శంకరరావు, ఎస్ఐ ప్రవల్లిక, అనూప్, సర్పంచ్ మజ్జి ద్రోణగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: మండలంలోని చిగురువలసలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని వైద్యాధికారి డాక్టర్ సాహితీ ప్రియదర్శిని ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని వివిధ రకాల వైద్య పరీక్షలు చేయించుకున్నారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది డి.మోహన రావు, సూపర్‌వైజర్ మోహనరావు, ఎంఎల్‌హెచ్‌పి రుక్మిణి, ఎఎన్‌ఎంలు అనూష, ఈశ్వరమ్మ, పార్వతి, హెల్త్ అసిస్టెంట్లు సింహాచలం, భాస్కరరావు, టిడిపి నాయకుడు సూర్యనారాయణ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: మహిళల ఆరోగ్య సంరక్షణకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని టిడిపి సీనియర్ నాయకుడు వాడరేవు కృష్ణారావు అన్నారు. మండలంలోని సీతానగరంలో సోమవారం స్వస్త్ నారీ సంకల్ప పరివార్ కార్యక్రమంలో

బూర్జ : వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

భాగంగా ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారులు పరిమళ, నందినిలు 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు లింగుడు కుమార్, టిడిపి నాయకులు గోపాలరావు, బ్రహ్మానందం, చిన్నబాబు, పాపారావు, రామారావు, మోహనరావు, పాండు పాల్గొన్నారు.

నరసన్నపేట: ప్రజారోగ్యం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్వస్తి నారీ స్త్రీశక్తి పరివార్ అబియాన్ కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలని మాకివలస పిహెచ్‌సి డాక్టర్ శిరిష సూచించారు. నరసన్నపేటలో 3వ సచివాలయం పరిధిలో సోమవారం మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కిషోర బాళికలు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల రక్తహీనత రాకుండా చూసుకోవచ్చు అని తెలిపారు. రక్తపోటు, మధుమేహం, కేన్సర్, రొమ్ము కేన్సర్, గర్భాశయం కేన్సర్‌పై పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి ఆరంగి మురళి, ఆయుష్ వైద్యులు సీతామహాలక్ష్మి, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ఆర్.ఝాన్సీరాణి, ఎఎన్ఎం చిన్నమ్మడు తదితరులు పాల్గొన్నారు.

జీడి పరిశ్రమల అభివృద్ధితోనే వలసల నివారణ

అసెంబ్లీలో ఎమ్మెల్యే గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

పలాసలోని జీడి పరిశ్రమల అభివృద్ధి తోనే వలసలు నివారణ సాధ్యమ వుతుందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. అమరావతిలో జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో జీడి పరిశ్రమలు, జీడిరైతుల సమస్యలపై ఆమె మాట్లాడారు. పలాస ప్రాంతంలోనే 25 వేల ఎకరాల్లో జీడిపంట సాగవుతుందన్నారు. తెల్ల బంగారంగా గుర్తింపు పొందిన పలాస జీడిపరిశ్రమల ద్వారా ఎంతో మందికి జీవనోపాధి కలుగుతుందన్నారు. పక్క రాష్ట్రాల మాదిరిగా జీడి వంటపై సెన్ విధానం రద్దు చేస్తే రైతులకు బస్తారు రూ.150 మిగులు తుందన్నారు. జీడిపంటపై ధరల స్థిరీకరణ చేయలేకపోయామని, సెన్ రద్దు చేస్తే రైతులకు కొంత ఊరట కలుగుతుందన్నారు. జీడిపరిశ్రమల అభివృద్ధికి సెంట్రల్ ఎక్సలెంట్ ఆఫ్ క్యాష్యు నుంచి రూ.పది కోట్లు మంజూరైనా స్థల సమస్య వల్ల ముందుకు వెళ్లలేకపోయామన్నారు. వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దీనిపై ప్రత్యేక చొరవ చూపి స్థల సమస్య పరిష్కరిస్తే జీడి పరిశ్రమలు అభివృద్ధి చెందుతాయని అన్నారు.

టిడ్కో ఇళ్లు త్వరితగతిన అందించాలి

ఎమ్మెల్యే రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

సిఎం చంద్రబాబు నాయుడు 2014 - 19లో రాష్ట్రంలో ఎన్‌టిఆర్ గృహ సముదాయం పథకం కింద సుమారు 5 లక్షల పక్కా గృహాలు మంజూరు చేయడం జరిగిందని ఎమ్మెల్యే కూన రవి కుమార్ సోమవారం శాసనసభలో ప్రస్తావించారు. అందులో భాగంగా ఆమదాలవలస నియోజక వర్గంలోని పురపాలక సంఘంలోని ఒకటవ వార్డు పరిధిలోని జగ్గుశాస్త్రుల పేట వద్ద 510 గృహాలు, మరోచోట 436 టిడ్కో గృహాలు మంజూరు చేయడం జరిగింద న్నారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసిపి టిడ్కో హౌసింగ్ కాలనీలను పక్కన పెట్టడంతో పాటు లబ్ధిదారుల నుంచి ప్రభుత్వం డిడిల రూపంలో నగదు కూడా కట్టించు కుంద న్నారు. గడచిన కొన్నేళ్ల నుంచి ఆ ఇళ్ల పనులను పూర్తి చేయకుండా నిరుప యోగంగా ఉంచడం వలన లబ్ధిదారులు పక్కా గృహాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

ఇప్పటికైనా సంబంధిత గృహ నిర్మాణశాఖ మంత్రి స్పందించి 80 శాతం పూర్తయిన గృహ సముదాయాలను మిగిలిన 20 శాతం నిర్మాణాలు పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేయాలని కోరారు.

ఫలించిన పోరాటం

శ్రీకాకుళం సిటీ : విజయోత్సవం నిర్వహిస్తున్న ఎల్ఐసి బేస్ యూనియన్ నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

దేశ వ్యాప్తంగా బీమా ఉద్యోగుల సంఘం చేసిన నిరంతర పోరాటానికి ఫలితం జిఎస్‌టి తగ్గింపు అని ఉద్యోగులు అన్నారు. నగరంలోని ఎల్ఐసి కార్యాలయం ముందు బేస్ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు మెట్ట మధు సూధనరావు, టి.ఆచారి ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ చర్యకు మద్దతు పలుకుతూ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సమీకరణ ఫలితంగా, కేంద్ర ప్రభుత్వం ఆరోగ్య, జీవిత బీమా ప్రీమియంపై అమలులో ఉన్న 18 శాతం జిఎస్‌టిని ఉపసంహరించుకుందని అన్నారు. 2017లో దేశ వ్యాప్తంగా 45.23 లక్షల సంతకాలను సేకరించి కేంద్రానికి సమర్పించామని అన్నారు. 2019లో నితి ఆయోగ్ సభ్యులకు, ప్రధాన రాజకీయ పార్టీలకు లేఖలు రాసి ఉపసంహరణ కోరామన్నారు. 2024 ఎన్నికల్లో పోటీ చేసిన వందలాది అభ్యర్థులను కలసి ఎన్నికల మేనిఫెస్టోలో ఈ అంశం చేర్చాలని విజ్ఞప్తి చేశామన్నారు. అన్ని వర్గాల నుంచి తమకు మద్దతు లభించిందని, ప్రభుత్వం దిగి వచ్చింద`న్నారు. షేర్ల అమ్మకం, ప్రైవేటీకరణకు వ్యతిరేఖంగా పోరాటం చేస్తామన్నారు. యూనియన్, బ్రాంచి యూనిట్ సభ్యులు, డెవలప్‌మెంట్ ఆఫీసర్ల యూనియన్ కార్యదర్శి వి.శ్రీనివాస కుమార్, అధ్యక్షులు శివకుమార్, ఏజంట్ల యూనియన్ నాయకులు కె.ధనుంజయరావు, కె.వి. రమణ మూర్తి, జీవిత బీమా విశ్రాంత ఉద్యోగుల నాయకులు కె.శ్రీని వాసు, ఆదినారాయణ మూర్తి, ఉద్యోగులు, ఏజంట్లు పాల్గొన్నారు.

పలాస: దేశవ్యాప్తంగా బీమా ఉద్యోగుల సంఘం చేసిన నిరంతర పోరాటం, ప్రజాభిప్రాయం, సమీకరణ ఫలితంగా కేంద్ర ప్రభుత్వం ఆరోగ్య జీవిత బీమా ప్రీమియంలపై అమలులో ఉన్న 18 శాతం జిఎస్‌టిని ఉపసంహరించుకుందని ఎఐఐఇఎ అధ్యక్ష, కార్యదర్శులు

పలాస : మాట్లాడుతున్న మదన్, సుబ్బారావు

జె.మదన్, ఎస్.సుబ్బారావు అన్నారు. ఈ మేరకు సోమవారం విలేకరులతో మాట్లాడారు. మొదట సర్వీస్ టాక్స్ అమలైనప్పటి నుంచీ దీన్ని వ్యతిరేకించామన్నారు. స్తూ 30 లక్షల మంది పాలసీ హోల్డర్ల సంతకాలతో కేంద్ర ఆర్థిక మంత్రికి లేఖ రాసిందన్నారు. 2019లో నీతి అయోగ్ సభ్యులకు, ప్రధాన రాజకీయ పార్టీలకు 400 మంది పైగా ఎంపిలకు కలిసి జిఎస్‌టి వసూలు అన్యాయమని వివరించామని అన్నారు. దీంతో ప్రజలు కొంత ఉపశమనం కలిగినా, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగుతునే ఉంటుందని స్పష్టం చేశారు. బీమా రంగంలో ఎన్‌డిఐ వంద శాతం పెంపు, ఎస్ఐసి షేర్లు అమ్మకానికి వ్యతిరేకంగా పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

జిఎస్‌టి తగ్గింపుపై అవగాహన అవసరం

పలాస : కేంద్ర ప్రభుత్వం విధిస్తున్న వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) సోమవారం తగ్గింపుపై వినియోగదారులకు అవగాహన తప్పనిసరి అని రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య వైస్ చైర్మన్ ఎల్.వెంకటాచలం అన్నారు. ఈ మేరకు సోమవారం విలేకరులతో మాట్లాడారు. వినియోగదారులు కొనుగోలు చేసే దాదాపు 375 రకాల ఉత్పత్తులపై పన్ను రేట్లు తగ్గించడం కొంత ఊరట లభిస్తుందన్నారు. వంట సరుకులు, విద్యార్థి వినియోగించే పుస్తకాలు, పెన్నులు స్టేషనరీ, ఎరువులు,. పురుగు మందులు ట్రాక్టర్లపై 5 శాతం తగ్గించిందన్నారు.

11 దరఖాస్తులు స్వీకరణ

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి రోటరీ నగర్‌లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని వీధి వాసులు కోరారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కమిషనర్ నడిపేన రామారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మొత్తం 11 దరఖాస్తులు రాగా, అందులో కరెంటు స్తంభం కోసం ఒకటి, జనన, మరణ ధ్రువపత్రాలకు 8, ఆస్తి పన్ను పేరు మార్పుకు 2 దరఖాస్తులు వచ్చాయి.

పరిశీలిస్తున్న అధికారులు

స్థల పరిశీలన

పోలాకి : పోలాకి పంచాయతీలోని చెత్తను సేకరించి వేసే డంపింగ్ యార్డుకు స్థలాన్ని పల్లిపేటలో ఎంపిడిఒ జి.రవికుమార్, తహశీల్దార్ పి.శ్రీనివాసరావు సోమవారం పరిశీలించారు. ఈ స్థలంలో చెత్త వేసేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి పద్మావతి, కార్యదర్శి చంద్రరావు, విఆర్ఒ రాంబాబు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో దసరా పద్యాలు

లావేరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులతో దసరా పద్యాల విశిష్టతను గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు తెలియజేశారు. ఐదు దశాబ్దాల క్రితం ఉపాధ్యాయులు విద్యార్థులచే దసరా పద్యాలు వల్లి వేయించి దసరా సెలవుల్లో విద్యార్థుల ఇళ్లకు వెళ్లి రంగురంగుల బాణాలతో దసరా పద్యాలు వల్లి వేసేవారు. ప్రస్తుత పరిస్థితిలో విద్యార్థులు సెల్‌ఫోన్లకు పరిమితం కావడంతో దసరా పద్యాలు కాలగమనంలో కొట్టుకు పోయాయి. దసరా సెలవుల్లో విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి విజ్ఞానవంతమైన పుస్తకాలు చదవాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు వీరభద్రుడు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి

నిరసన తెలియజేస్తున్న ప్రైవేట్ కాలేజ్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ప్రభుత్వం డిగ్రీ కళాశాలలకు చెల్లించాల్సిన ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని, చెల్లించే వరకు బంద్ పాటిస్తామని ఎపి ప్రైవేట్ డిగ్రీ కాలేజ్ మేనేజ్‌మెంట్ అసోషియేషన్ అధ్యక్షులు పొన్నాన జయరాం అన్నారు. ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లింపులో ప్రభుత్వ నిర్లక్ష్యం వ్యతిరేఖిస్తూ సోమవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విశ్వ విద్యాలయం పరిధిలోని కళాశాలలు బంద్ నిర్వహించారు.

సమస్య పరిష్కరించే వరకు డిగ్రీ కళాశాలల బంద్

విశ్వవిద్యాలయం ముందు నిరసన కార్యక్రమం నిర్వహించారు. గతేడాదికి సంబంధించిన మూడు, ఈ ఏడాదికి సంబంధించిన ఒకటి మొత్తం నాలుగు వాయిదాల్లో ఫీజులు చెల్లించాలని, బకాయిలు పేరుకు పోయాయన్నారు. సమస్య పరిష్కారం అయ్యేవరకు బంద్ పాటిస్తామని, క్లాస్‌వర్కు నిర్వహించమని యూనియన్ నాయకులు స్పష్టం చేశారు. ప్రభుత్వం ఉన్నత విద్య నిర్వీర్యం చేస్తుందని, కోట్లు నష్టంతో కళాశాలలు ఎలా నడపాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఏడాదికి నాలుగు విడతల్లో ఫీజు రీయంబర్స్‌మెంట్ చెల్లిస్తామన్న ప్రభుత్వం గత విద్యా సంత్సరం పూర్తయినా ఇంకా మూడు విడతలు చెల్లించ లేదన్నారు. భవిష్యత్‌లో కళాశాలలు ప్రభుత్వ విధానం వల్ల మూత పడతాయన్నారు. కార్యక్రమంలో అసోషియేషన్ ప్రాంతీయ కో-ఆర్డినేటర్ కోత మురళీధర్, యూనియన్ సభ్యులు మొదలవలస మోహనరావు, చిట్టిబాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కొబ్బరికి అధిక ధర చెల్లిస్తాం

ప్రజాశక్తి- కవిటి

కొబ్బరి నారుమడులకు లక్ష కొబ్బరికాయలు అవసరమయ్యాయని, వీటిని ప్రస్తుత మార్కెట్ ధరపై 30 శాతం అధికంగా చెల్లించి రైతుల నుంచి కొనుగోలు చేస్తామని కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డు అధికారులు ప్రకటించారు. ఈ సందర్భంగా మండలంలోని తోటలను డిప్యూటీ డైరెక్టర్ మంజునాథ్ రెడ్డి, ఒడిశా డిప్యూటీ డైరెక్టర్, వేగువాడ డిఎస్‌పి ఫామ్ డైరెక్టర్ రఘోత్తం, కర్ణాటక డిఎస్‌పి ఫామ్ డైరెక్టర్ ధనశేఖర్ స్థానిక చికాఫ్ ప్రతినిధులతో కలిసి సోమవారం రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్టోబరు నుంచి నవంబరు మధ్యలో ఈ లక్ష కొబ్బరికాయలు కొనుగోలు చేస్తామని అన్నారు. అలాగే అవసరాన్ని బట్టి మార్చి తరువాత మరో లక్ష కాయలు కొనుగోలు చేయడానికి సిద్ధమవుతున్నామని వెల్లడించారు. రైతు కూలీల భద్రత కోసం ప్రత్యేక బీమా పథకాన్ని అధికారులు వివరించారు. రూ.140 ప్రీమియం చెల్లిస్తే,

రైతులతో మాట్లాడుతున్న అధికారులు

ప్రమాదవశాత్తు గాయపడితే రూ.3.5 లక్షల వరకు వైద్య ఖర్చులు, ప్రాణహాని జరిగితే రూ.7 లక్షల వరకు బీమా సదుపాయం కల్పిస్తామని తెలిపారు. ఇక రైతులు కోరుతున్న కొబ్బరి బీమా పథకంలో కొన్ని మార్పులు చేసి మరింత రక్షణ కల్పించేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. దీని పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చికాఫ్ ప్రతినిధులు జోహార్ ఖాన్, ఆరింగి శివాజీ, గొనప రాజు, గొండ్యాల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎపిఎం ప్రసాదరావు

ప్రభుత్వ పథకాలు వివరించాలి

ప్రజాశక్తి- మందస

ప్రభుత్వ పథకాలను గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు, నిరక్షరాస్యులకు అర్థమయ్యే విధంగా వివరించాలని వెలుగు ఐటిడిఎ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. మండల వెలుగు కార్యాలయంలో మండల సమాఖ్య కోశాధికారి విజయశ్రీ అధ్యక్షతన సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలకు, రైతులకు అర్హత కలిగిన అన్ని కుటుంబాలకు లబ్ధి చేకూర్చే విధంగా ప్రణాళికలు తయారు చేసి అమలు చేస్తున్నట్లు వివరించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు అవసరమైన పనిముట్లు సమకూర్చుకోవడానికి రుణ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. మహిళా సంఘాల్లో ఆసక్తి ఉన్న ఎంటర్ప్రెనర్లను గుర్తించి వారికి అవసరమైన శిక్షణ, పరపతి సౌకర్యం కల్పిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో విఒఎలు, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు, లీగల్ కో-ఆర్డినేటర్ తరక మోహన్, అకౌంటెంట్లు కళ్యాణి, కృష్ణకుమారి, డేటాఎంట్రీ ఆపరేటర్ రాజారావు పాల్గొన్నారు.

నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

గంజాయితో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఒడిశా నుంచి అక్రమంగా గంజాయి తరలిస్తున్న వ్యక్తిని ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్ వద్ద అరెస్టు చేసి ఆయన వద్ద నుంచి 15 కేజీల 80 గ్రామాఉల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని సిఐ మీసాల చిన్నంనాయడు తెలిపారు. సోమవారం పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. రైల్వేస్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న తమిళనాడు రాష్ట్రానికి చెందిన అజయ్ బ్యాగ్‌ను టౌన్ ఇన్‌ఛార్జి ఎస్ఐ వి.రవివర్మ పరిశీలించి గంజాయిని స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. ఆయనను అరెస్టు చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. మిగిలిన నిందితులు కోసం గాలిస్తున్నామని తెలిపారు.

వినతిపత్రం అందజేస్తున్న కృష్ణమూర్తి

థర్మల్ కేసులు ఎత్తివేయాలి

ప్రజాశక్తి- సోంపేట

సోంపేట థర్మల్ పోరాటంలో ఉద్యమకారులపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేయాలని సోంపేటకు చెందిన పర్యావరణ పరిరక్షణ సమితి అధ్యక్షుడు డాక్టర్ వై.కృష్ణమూర్తి కోరారు. ఈ మేరకు సోమవారం ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ తో కలిసి హోంమంత్రి అనితను అసెంబ్లీ వద్ద కలిశారు. థర్మల్ పోరాటంలో ఉద్యమకారులపై అక్రమ కేసులు బనాయించారని, ఈ కేసులు రద్దు చేయకపోవడంతో చాలామంది ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ప్రభుత్వం ఉద్యమకారులపై కేసులు ఎత్తివేసి, న్యాయం చేయాలని కోరారు.

పాట సిడిని ఆవిష్కరిస్తున్న రాజారావు

మకరతోరణం వితరణ

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని గొండ్యాలపుట్టుగలో ఉన్న భూలోకమాత అమ్మవారికి రూ.55 వేలు విలువ చేసే మకరతోరణాన్ని యాత్రికులకు అందించారు. పాండవ రామారావు, ఇంటెనుక గడ్డెమ్మ, దేవాడ లోకనాథం, బల్ల చలపతి, కోళ్ల బాబూరావు సంయుక్తంగా అందించిన ఈ మకరతోరణం సోమవారం ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. శరన్నవరాత్రి మహోత్సవాలు పురస్కరించుకొని భూలోక మాత అమ్మవారిపై రాజపురానికి చెందిన విజయ్ తారక్ ఆలపించిన భక్తి గీతం సిడిని ఆలయ ప్రాంగణంలో పాండవ రామారావు, గ్రామస్తులు సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ సాగర్ రచించిన అమ్మవారి పాట విజయ్ తారక్ అద్భుతంగా ఆలపించారని కొనియాడారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

25న చంద్రమ్మ వర్ధంతి

మెళియాపుట్టి: ఈ నెల 25న పలాస టిఆర్‌కె కళ్యాణ మండపంలో నిర్వహించనున్న పైల చంద్రమ్మ వర్ధంతి సభను విజయవంతం చేయాలని ఆదివాసీ నాయకులు, అరుణోదయ జిల్లా కార్యదర్శి కె.సోమేశ్వరరావు పిలుపునిచ్చారు. మండలంలోని హడ్డివాడలో సోమవారం పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లాలోని ఆదివాసీ గ్రామాలన్నీ ఏజెన్సీలో చేర్చాలన్నారు. 1/70 చట్టం అమలు చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా విభజన తర్వాత సీతంపేట ఐటిడిఎ పార్వతీపురం మన్యం జిల్లాకు వెళ్లిపోయి ందన్నారు. మెళియాపుట్టి సెంట్రల్‌గా ఐటిడిఎను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎ.బాబూ రావు, ఎస్.శంకర్, శ్రీను, గంగయ్య, గణేష్, పోలయ్య, శ్రీరాములు, ఆదినారాయణ, లీలారాణి పాల్గొన్నారు.

ఘనంగా నవరాత్రి మహోత్సవాలు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

ఆలయంలో శ్రీనివాసరావు

సోమవారం నుంచి కుశాలపురంలో దేవీ నవరాత్రి మహోత్సవాలు వైభవంగా ప్రారంభం కానున్నాయి. ప్రతి ఏడాది జరిగే ఈ ఉత్సవాలు వైభవోపేతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ మహోత్సవాలు డాక్టర్ సూర శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరగనున్నాయి. కళశ స్థాపనతో ప్రారంభమై, తొమ్మిది రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమాలు, అలంకరణలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, హరికథలు, అన్నదానం వంటి అనేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సూర శ్రీనివాసరావు మాట్లాడుతూ విజయదశమి సందర్భంగా మహాపూజలు, ప్రత్యేక అలంకరణ, శోభాయాత్ర ఘనంగా నిర్వహించబడునని తెలిపారు.

ప్రహరీ పనులకు శంకుస్థాపన

వజ్రపుకొత్తూరు: మండలంలోని డోకులపాడు సచివాలయ ప్రహరీ నిర్మాణానికి సర్పంచ్ వడ్డి సరిత, భర్త కరుణాకర్ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మౌలిక సదుపాయాలను కల్పిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి భాగ్యలక్ష్మి, భర్త దిల్లేశ్వరరావు, ఉప సర్పంచ్ మదనాల మణి, కార్యదర్శి చంద్రమ్మ పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడు అప్పగింత

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

నగరంలో చౌదరి సత్యనారాయణ కాలనీకి చెందిన ఆరేళ్ల ముద్దాడ యాదేవ్ సోమవారం ఉదయం తప్పిపోయాడు. తల్లి దండ్రులు 112 ఎమర్జెన్సీకి కాల్ చేశారు. రెండో పట్టణ సిఐ ఈశ్వరరావు ఆధ్వర్యంలోని పోలీసులు గంటలోనే డే అండ్ నైట్ కూడలి సమీపంలో పట్టుకుని తల్లిదండ్రులకు బాలుడిని అప్పగించారు.

సమావేశంలో మాట్లాడుతున్న పాస్టర్లు

సమాధుల నేలమట్టం అన్యాయం

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

శ్రీకాకుళం క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్‌లో సమాధులను నేలమట్టం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని శ్రీకాకుళం నగర బరియల్ గ్రౌండ్ కమిటీ సభ్యులు, పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. స్థానిక డగ్గస్ క్యాంపస్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, కొత్త బ్రిడ్జి సమీపంలోని సెయింట్ జోసెఫ్ కాన్వెంట్ గోడకు ఆనుకుని ఉన్న క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్‌లో శుభ్రత పేరిట సమాధులను నేలమట్టం చేయడం క్రైస్తవుల మనోభావాలను దెబ్బతీయడమేనన్నారు. నేలమట్టం చేసిన సమాధులపై మొక్కలు నాటడం సరికాదన్నారు. 150 సమాధులను జెసిబి ద్వారా ధ్వంసం చేయించిన వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్, ఎస్‌పికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం

నరసన్నపేట: సమాజంలో రక్తదానం ప్రాణ దానం లాంటిదని, రక్తదానానికి మించిన దానం మరొకటి లేదని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ జి.రవికుమార్ అన్నారు. నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్, రెడ్ రిబ్బన్ క్లబ్ సంయుక్తంగా సోమవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 నుంచి 70 ఏళ్ల వరకు ఆరోగ్యపరంగా ఎటువంటి ఇబ్బందులూ ఉండవన్నారు. 45 కేజీలు బరువు ఉన్నవారు రక్తం దానం చేయవచ్చు అని తెలిపారు. అనంతరం రక్తదాతలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

సంతబొమ్మాళి: మండలంలోని లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు, అంగన్వాడీ కేంద్రంలోని చిన్నారులకు పూర్వ విద్యార్థి, బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న కింజరాపు శ్రీధర్ సోమవారం దుప్పట్లు పంపిణీ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు రెడ్డి సూరిబాబు మాస్టర్ శ్రీధర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కింజరాపు సురేష్, బాడన చిన్నమనాయుడులు పాల్గొన్నారు.

నాబార్డు నిధులతో రోడ్డు అభివృద్ధి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

దుర్గారావు

నాబార్డు నిధులతో గ్రామీణ రోడ్లను కూటమి ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని పలాస నియోజకవర్గ జనసేన సమన్వయకర్త డాక్టర్ వి.దుర్గారావు అన్నారు. ఈ మేరకు సోమవారం విలేకరులతో మాట్లాడారు. పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లో రూ.3.14 కోట్ల నాబార్డు నిధులతో ఆరు ప్రధాన రహదారుల్లో అభివృద్ధి పనులు చేపట్టనున్నారని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చొరవతో రోడ్ల విస్తరణకు రూ.3.14 కోట్లు కేటాయించారని అన్నారు. మండల కేంద్రం నుంచి నగరంపల్లికి రూ.79.70 లక్షలు, అమలపాడు నుంచి ఉద్దానం రామకృష్ణాపురానికి రూ.84 లక్షలు, పూండి నుంచి చిన్నమురహరిపురానికి రూ.29.87 లక్షల నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. పలాస మండలంలో జాతీయ రహదారి నుంచి నీలావతికి రూ.39.84 లక్షలు, ఆర్‌బి రోడ్డు నుంచి కొండపల్లికి రూ.49.76 లక్షలు, స్వయం భూవరం నుంచి గురుదాసుపురానికి రూ.29.9 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయని చెప్పారు. దీంతో గ్రామీణ రోడ్లకు మహర్దశ రానుందన్నారు.

వాయు కాలుష్యాన్ని తగ్గిద్దాం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

సైక్లింగ్ చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

వాయు కాలుష్యాన్ని తగ్గిద్దాం, సైకిల్‌పై ప్రయాణిద్దామని జిల్లా ఎన్విరాన్మెంట్ ఛైర్మన్ లయన్ పొన్నాడ రవికుమార్ అన్నారు. మన ఊరు, మన బాధ్యతలో భాగంగా లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో సైక్లింగ్ అసోసియేషన్ సభ్యులతో పర్యావరణ పరిరక్షణలో భాగంగా సైక్లింగ్ చేస్తూ వాయు కాలుష్యంపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని, సైక్లింగ్‌తో వాయు కాలుష్యంపై అవగాహన కల్పించామని, సుస్థిర ఆరోగ్యానికి సైక్లింగ్ దోహదపడుతుందన్నారు. చిన్నచిన్న అవసరాలకు సైకిల్‌ను వినియోగిస్తే, ఆరోగ్యంతో పాటు కాలుష్యాన్ని తగ్గించి, పర్యావరణ పరిరక్షణలో భాగమౌతామన్నారు. ప్రతీ పౌరునితో ఒక మొక్కను నాటించి, మన వంతు బాధ్యతను నిర్వహిద్దామని పిలుపునిచ్చారు. లయన్ మెంటార్ నటుకుల మోహన్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకంతో మానవ మనుగడ కష్టతరమని, ప్లాస్టిక్‌కి బదులు ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించాలన్నారు.

ఎంటిఎస్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

డిఇఒకు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

శ్రీకాకుళం సిటీ: 998 డిఎస్‌సి ఎంటిఎస్ ఉపాధ్యాయుల సమస్యలుపరిష్కరించాలని డిఇఒ రవిబాబుకు సోమవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. తమకు మళ్లీ కౌన్సెలింగ్ నిర్వహించి సమీప ప్రాంతాల్లో నియమించాలని కోరారు. కొందరికి 100 కిలోమీటర్లు దాటి బదిలీ చేశారన్నారు. తమకు హెచ్ఆర్ఎ, టిఎ, డిఎ వంటివి వర్తింపు చేయటం లేదన్నారు. ప్రభుత్వ దృష్టికి సమస్య తీసుకువెళ్లాని, తమకు రెగ్యులర్ ఉద్యోగుల వలే వేతనం, ఇతర సౌకర్యాలు వర్తింపజేయాలని కోరారు. వయసును సైతం పరిగణలోకి తీసుకోవాలని సూచించారు. ఏపి డిఎస్‌సి 98 టీచర్స్ ఫెడరేషన్ యూనియన్ నాయకులు సిహెచ్ మల్లేశ్వరరావు, యూనియన్ సభ్యులు పాల్గొని సమస్య వివరించారు.

బాధిత కుటుంబానికి అండ

ప్రజాశక్తి- మెళియాపుట్టి

బియ్యం అందజేస్తున్న సర్పంచ్ ప్రసాదరావు

మండలంలోని నందవకు చెందిన సవర బండయ్య ఇంటి గోడ వర్షాలు కారణంగా గోడ ఇటీవల కూలిపోయింది. ఈ ఘటనతో కుటుంబం తాత్కాలికంగా నివాసం కోల్పోయింది. విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ తెంబూరు ప్రసాదరావు స్పందించి సోమవారం బాధిత కుటుంబానికి 50 కేజీల బియ్యం, అవసరమైన కూరగాయల పంపిణీ చేశారు. బాధిత కుటుంబానికి అన్ని విధాల ఆదుకుంటామని, ప్రభుత్వం నుంచి మరింత సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఎస్.ఆదినాయుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను ప్రోత్సహించే దిశగా ఎదగాలి

ఎచ్చెర్ల: ఆర్‌జియుకెటి ఆధ్వర్యంలో నిర్వహించే స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ కార్యక్రమానికి విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలో ఆవిష్కరణ, సృజనాత్మకతను ప్రోత్సహించే దిశగా, విద్యార్థులకు వాస్తవ ప్రపంచ సమస్యలను పరిష్కరించడానికి, సృజనాత్మకత, సాంకేతిక నైపుణ్యాలను ఉపయోగించుకొని దేశ ప్రయోజనానికి దోహద పడటానికి ఈ కార్యక్రమం ఉపయోగ పడుతుందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ ప్రొఫెసర్ బాలాజీ, పరిపాలన అధికారి డాక్టర్ ముని రామకృష్ణ, డీన్ డాక్టర్ శివ రామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ డాక్టర్ వాసు, వెల్ఫేర్ డీన్ డాక్టర్ రవి గేదెల, పిఆర్ఒ మామిడి షణ్ముఖ, డిసిఎంఎస్ ఛైర్మన్ చౌదరి అవినాష్, చౌదరి బాబ్జి, టిడిపి నాయకులు గాలి వెంకటరెడ్డి, నూకరాజు, తోటపాలెం అబ్బు, శ్రీరామ్, నాయుడు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విత్తన బంతులు అందజేస్తున్న సెయింట్ జోసఫ్ పాఠశాల ఉపాధ్యాయులు

పర్యావరణంతో ప్రగతి

శ్రీకాకుళం సిటీ: పర్యావరణంతోనే ప్రగతి సాధ్యమని సెయింట్ జోసఫ్ పాఠశాల ప్రిన్సిపల్ రాజేశ్వరం అన్నారు. తమ పాఠశాల విద్యార్థులు తయారు చేసిన విత్తన బంతులను స్థానిక అటవీ శాఖ కార్యాలయంలో ఆ శాఖ అధికారులకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు గంటలో 1.92 లక్షల విత్తన బంతులు తయారుచేసి వరల్డ్ రికార్డ్ యూనియన్ ధ్రువీకరణ పొందారని తెలిపారు. "పచ్చని చెట్టు- ప్రగతి మెట్టు, విసిరే విత్తనం ఎదిగే వనం" అనే నినాదాలతో రికార్డు సృష్టించారని చెప్పారు. సెయింట్ జోసెఫ్ అన్నెసీ సంస్థ 375వ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 18న ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, పాఠశాలలోని 1400 మంది విద్యార్థులు 1,92,782 విత్తన బంతులు తయారు చేశారని చెప్పారు. ఒక్కొక్కరు సగటున 137.63 విత్తన బంతులు తయారు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని వరల్డ్ రికార్డ్ యూనియన్ ప్రతినిధులు ఆన్‌లైన్ ద్వారా పర్యవేక్షించి, రికార్డును ధ్రువీకరించారన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ జోసెఫిన్ మేరీ, స్వర్ణ జేవియర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్‌లో సత్తా

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఆంధ్రా యూనివర్సిటీ వేదికగా విశాఖపట్నంలో ఇటీవల జరిగిన కిక్ బాక్సింగ్ పోటీల్లో సిక్కోలు క్రీడాకారులు ప్రతిభ కనబరిచి పలు పతకాలు కైవసం చేసుకున్నారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు నగరంలోని వైఎస్ఆర్ కళ్యాణ మండపంలో సోమవారం సత్కరించి పతకాలు, ప్రశంసాపత్రాలను ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్, లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా ఛైర్మన్ నటుకుల మోహన్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో సిక్కోలు క్రీడాకారులు ప్రతిభావంతులుగా నిలవడం అభినందనీయమన్నారు. క్రీడాకారులకు శిక్షణ అందిస్తున్న అసోసియేషన్ వ్యవస్థాపకులు వై.హేమంత్‌కుమార్ చీఫ్ కోచ్ హరీష్‌లను అభినందించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది తాండ్ర శ్రీనివాస్, తిరుపతిరావు, వెంకటేష్, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్ క్రీడాకారులకు అభినందిస్తున్న ప్రతినిధులు

వృద్ధుల హక్కులపై అవగాహన

శ్రీకాకుళం లీగల్: వృద్ధుల వేధింపులపై అవగాహన కల్పించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఇలిసిపురం ఖ్యాతి వృద్ధాశ్రమంలో సోమవారం సదస్సు నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా సూచనలతో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు వృద్ధులకు హక్కులు, చట్టాలు, ప్రభుత్వ పథకాలను వివరించారు. ఖ్యాతి వృద్ధాశ్రమ ప్రతినిధి శ్రావణి పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

కెపి స్పందన ఆర్థికసాయం

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

జీవించు... జీవితాన్నివ్వు అనే థీమ్‌తో సేవలు అందిస్తున్న కెపి స్పందన ఫౌండేషన్ రోగపీడిత కుటుంబాలకు ఆర్థికసాయం అందించింది. మందుల కొనుగోలు కోసం నరసాపురం పంచాయతీ ఆకుల సత్యవానిపేటకు చెందిన ఇచ్ఛాపురం యోగి కుటుంబానికి రూ.పది వేలు, వడ్డివాడకు చెందిన కొవ్వూరు చిన్నారావు కుటుంబానికి రూ.పది వేలు అందించారు. యోగి ఎముకమజ్జ కేన్సర్‌తో, చిన్నారావు ఎపిలెప్సీతో బాధపడుతున్నారు. వీరికి అవసరమైన సహాయాన్ని అందించిన స్పందన సేవకులను గ్రామస్తులు ప్రశంసించారు. కార్యక్రమంలో షణ్ముఖ మాస్టర్, నరసాపురం సర్పంచ్ డి.భూషణ్‌రెడ్డి, వై.అప్పన్న, డి.మల్లేసు, పి.రవి, బి.అశ్విని పాల్గొన్నారు.

కృష్ణదాస్ పరామర్శ

ప్రజాశక్తి- పోలాకి

పరామర్శిస్తున్న కృష్ణదాస్

మండలంలోని పాతూరులో కుసుమపోలవలస మాజీ సర్పంచ్ గొల్లంగి వెంకటరావు సతీమణి రమణమ్మ మృతి చెందింది. విషయం తెలుసుకున్న వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ సోమవారం పరామర్శించారు. ఆమె మృతిపై తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆమె మృతికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో డిసిసిబి మాజీ ఛైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ముద్దాడ భైరాగినాయుడు, వైసిపి మండల అధ్యక్షులు కణతి కృష్ణారావు, సర్పంచ్ బోర సోమేశ్వరరావు, రావాడ అప్పలరాజు, పొగోటి నందేసు, మెండ రామకృష్ణ, సర్పంచ్‌లు గొల్లంగి అసిరి నాయుడు, రాయల మల్లేశ్వరరావు, యూత్ విభాగం కార్యదర్శి గొల్లంగి కృష్ణారావు పాల్గొన్నారు.

అలాగే గోపాలపెంటలో మృతి చెందిన మార్పు నాగేశ్వరరావు మాస్టర్ కుటుంబ సభ్యులనూ పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపిపి ఆరంగి మురళీధర్, పొందర కూరకుల కార్పొరేషన్ విభాగ అధ్యక్షులు రాజపు అప్పన్న, నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షులు సురంగి నర్సింగరావు, మండల బూత్ కమిటీ అధ్యక్షులు బబ్బాది ఈశ్వరరావు, సర్పంచ్ కనపల శేఖరరావు, ఎంపిటిసి గదిలి మల్లేశ్వరరావు పాల్గొన్నారు.